క్లుప్తంగా

రేపు వైద్యశిబిరం

పరకాల: విమలాకర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈ నెల18న మండలంలోని వెల్లంపల్లిలో ఉచిత మెగా వైద్యశిబిరం నిర్వహించనున్నట్లు డాక్టర్ బరిగెల రమేశ్, విమలాకర్‌రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. వివిధ రాష్ట్రాల నుంచి 70 మంది వైద్యబృందం 300 మంది రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

జాతరలో రేవూరి మిత్రమండలి సేవలు



దామెర : మండలంలోని ఊరుగొండ లక్ష్మీనర్సింహస్వామి జాతరలో రేవూరి మిత్రమండలి సేవలు అందించినట్లు సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు కూనాటి రామకృష్ణారెడ్డి తెలిపారు. గ్రామ సమీపంలోని గుట్టపై బుధవారం, గురువారం జరుగుతున్న జాతరలో మిత్ర మండలి ఆధ్వర్యంలో ఉచితంగా మినరల్ వాటర్ బాటిళ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ వలంటీర్లు భక్తులకు సేవలందించడం జరుగుతుందని అన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షులు భూపతి రమేష్, నాయకులు మధుకర్, రాజు, అనిల్, సారయ్య, కుమార్, సాంబయ్య, సంపత్, రాజయ్య, తదితరులు పాల్గొన్నారు.

రేషన్ బియ్యం పట్టివేత



కమలాపూర్ : రేషన్ బియ్యం అక్రమంగా నిల్వ చేశారన్న సమాచారం మేరకు స్థానిక శ్రీలక్ష్మీ గణపతి ఫంక్షన్ హాల్‌పై టాస్క్‌ఫోర్స్ పోలీసులతో కలిసి బుధవారం దాడి చేసి రూ.1,78,750 విలువ చేసే 71.7 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని పట్టుకున్నట్లు ఇన్‌స్పెక్టర్ హరికృష్ణ తెలిపారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి రేషన్ వినియోగదారుల నుంచి కొనుగోలు చేసిన రేషన్ బియ్యాన్ని 50 కిలోల చొప్పున పౌర సరఫరాల శాఖకు చెందిన 143 బ్యాగుల్లో నింపారన్నారు. బియ్యాన్ని స్వాధీనం చేసుకుని పంగిడిపల్లికి చెందిన ఎం.శ్రీనివాస్‌పై కేసు నమోదు చేసి అరెస్ట్ చేసినట్లు సీఐ తెలిపారు.

మాజీ సీఎం మాయావతి జన్మదిన వేడుకలు



పరకాల: బీఎస్పీ అధినేత్రి, ఉత్తరప్రదేశ్ మాజీ సీఎం మాయావతి 69వ జన్మదిన వేడుకలను పట్టణంలో బీఎస్పీ కార్యకర్తలు బుధవారం ఘనంగా నిర్వహించారు. బీఎస్పీ రాష్ట్ర కార్యదర్శి శనిగరపు రాజు ఆధ్వర్యంలో ర్యాలీ చేపట్టిన అనంతరం పరకాల సివిల్ ఆస్పత్రిలో రోగులకు ఉచితంగా పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు పసుల వినయ్, నాయకులు కాకి శరత్ చంద్ర, కర్రె రమేష్, ముత్యాల నరేందర్, మడికొండ రవళి, దుర్గ ప్రసాద్, భిక్షపతి పాల్గొన్నారు.

పరామర్శ



ఐనవోలు: మండలంలోని రాంనగర్ గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్, మాజీ నందనం సొసైటీ అధ్యక్షుడు బోయినపెల్లి లక్ష్మీనరసింహారావు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు.

క్రికెట్ పోటీల్లో ఐనవోలు జట్టు విజయం



ఐనవోలు : జఫర్‌గఢ్, వర్ధన్నపేట, ఐనవోలు మండలాల మండల లెవల్ ప్రీమియర్ లీగ్ పోటీల్లో ఐనవోలు జట్టు విజయం సాధించిందని జట్టు కెప్టెన్ సాంబారి శివ తెలిపారు. డిసెంబర్ 27న క్రికెట్ లీగ్ ప్రారంభం కాగా 30 జట్లు పాల్గొనగా మంగళవారం జరిగిన ఫైనల్లో బండౌతాపురం జట్టుపై 27 పరుగుల తేడాతో ఐనవోలు జట్టు గెలిపొందింది. వీరికి నిర్వాహకులు ప్రథమ బహుమతి రూ.15వేలు, ట్రోఫీ అందజేశారు.

ఎగువన ఫుల్.. దిగువన నిల్

- చివరి ఆయకట్టుకు అందని సాగునీరు
- కాల్వల్లో పెరిగిన విద్యుత్ మోటార్ల వాడకం
- దిగువకు పారని ఎస్సారెస్పీ కాల్వ నీరు



కమలాపూర్‌లో నీటితో కళకళలాడుతున్న ఎస్సారెస్పీ కాల్వ



గోపాల్‌పూర్‌లో నీరు లేక వెలవెలబోతున్న ఎస్సారెస్పీ ఉప కాల్వ



కానిపర్తి శివారు ఎస్సారెస్పీ కాల్వలో అమర్చిన విద్యుత్ మోటార్లు

కమలాపూర్: ఎస్సారెస్పీ కాల్వల నిర్వహణ, అధికారుల పర్యవేక్షణా లోపం రైతుల పాలిట శాపంగా మారింది. కాల్వలు ఎగువన నీటితో కళకళలాడుతుంటే.. దిగువన చుక్క నీరు లేక వెలవెలబోతున్నాయి. పలువురు రైతులు ఎస్సారెస్పీ కాలువల్లో విద్యుత్ మోటార్లు అమర్చుకుని సాగు నీటిని యథేచ్ఛగా వినియోగిస్తుండడంతో దిగువకు నీరు పారక చివరి ఆయకట్టు రైతులు దిక్కుతోచని స్థితిలో కొట్టుమిట్టాడుతున్నారు.

26వేల ఎకరాల ఆయకట్టు..

కమలాపూర్ మండల వ్యాప్తంగా డీబీఎం 18, 20, 21, 22, 22ఏ, 24 కాల్వలు, వాటికి అనుబంధంగా ఉన్న ఉప కాల్వల కింద సుమారు 26వేల వరకు ఆయకట్టు ఉంది. అయితే కేవలం కాల్వ నీటిపైనే ఆధారపడి సుమారు 12వేలకు పైగా ఎకరాల్లో రైతులు పంటలు సాగు చేస్తున్నారు. ప్రస్తుత యాసంగిలో కాల్వల ద్వారా సాగు నీరు విడుదల చేయడంతో అన్నదాతలు ఆనందంలో మునిగిపోయారు. అయితే.. ఎంతకూ ఆ నీరు చివరి ఆయకట్టుకు అందక పోవడంతో తీవ్ర నిరాశ, నిస్పృహలకు లోనవుతున్నారు.

కమలాపూర్‌లో ఫుల్.. గోపాల్‌పూర్‌లో నిల్

ఈనెల 8న వారబందీ పద్ధతిలో ఎస్సారెస్పీ కాల్వల ద్వారా యాసంగి పంటలకు సాగు నీరు విడుదల చేశారు. దీంతో ఎగువన ఉన్న పలువురు రైతులు విద్యుత్ మోటార్లు అమర్చుకుని ముమ్మరంగా వరి నాట్లు వేస్తున్నారు. అయితే.. ఇప్పటి వరకు గోపాల్‌పూర్ గ్రామానికి కాల్వ ద్వారా చుక్క నీరు పారక పోవడంతో రైతులు ఎదురు చూస్తున్నారు.

సుక్క నీరు వత్తలేదు..



నాకున్న 1.10 ఎకరాల్లో కాల్వ నీటి మీద ఆధారపడి వరి పంట వేసిన. ఉన్న బోరు నీళ్లతోని ప్రస్తుతం వరి పంటను కాపాడుకుంటాన. ఇప్పటికే బోరు నీరు సరిపోవడంలేదు. మరి కొద్ది రోజులు గడిస్తే అసలు నీళ్లే ఎల్లని పరిస్థితి ఉంటది. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి చివరి ఆయకట్టు వరకు సాగు నీళ్లు వచ్చేలా చెయ్యాలె.

– మామిడాల లింగమూర్తి, గోపాల్‌పూర్

చివరిదాక నీళ్లు అందుత లెవ్వు



యాసంగి పంటకు కాల్వ నీళ్లు వత్తయన్న ఆశతోటి మాకున్న భూమిలో మొక్కజొన్న పంటేసిన. వారబందీ పద్ధతిలో కాల్వ నీళ్లు వదిలినా ఇప్పటి వరకు సరిపడా రావడం లేదు. ఉన్న వ్యవసాయ బావి నీళ్లతోనే నెట్టుకొస్తాన. కొద్ది రోజుల తర్వాత బావిలో నీళ్లు ఎల్లకపోతే పంట నష్టపోవాల్సి వస్తది. యాసంగి పూర్తయ్యే దాక నీళ్లు ఇయ్యాలె.

– కొదారి రాజు, శనిగరం

వైభవంగా వీరభద్రస్వామి రథోత్సవం



వీరభద్రస్వామి రథోత్సవంలో పీవీ కుటుంబ సభ్యులు

ఎల్కతుర్తి : హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం వంగర గ్రామంలో వీరభద్ర రథోత్సం మంగళవారం యాదవుల డోలు విన్యాసాలు, శివసత్తుల పూనకాలు, హరిజన డప్పుచప్పుళ్లు, మహిళల కోలాటాల మధ్య వైభవంగా నిర్వహించారు. కొత్తకొండ వీరభద్రస్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా సంక్రాంతిని పురస్కరించుకొని బండ్లు తిరిగే రోజున పీవీ కుటుంబీకులు వందేళ్ల కాలంగా నిర్వహిస్తున్నారు. ఈ రథం కొత్తకొండకు చేరుకొని స్వామివారికి బియ్యం, గుమ్మడికాయ సమర్పించి మొక్కులు చెల్లించారు. పీవీ వంశస్తుల తరుపున పీవీ మనోహర్‌రావు, ఇంటి వద్ద నుంచి పీవీ మదన్‌మోహన్‌రావు, మాధవరావు ఆయన కుమారుడు శరత్ వీరభద్రస్వామికి మొక్కులు చెల్లించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ రథోత్సవానికి అపూర్వ చరిత్ర ఉందని తమ కుటుంబానికి కొత్తకొండ వీరభద్రుడు ఇలవేల్పు అని తమ తండ్రిని దత్తత తీసుకున్న రంగారావు నాయనమ్మ సంతాన ప్రాప్తి కొరకు గ్రామస్తులు ఆయురారోగ్యాలతో పాడిపంటలతో విరజిల్లాలని వేడుకున్నట్లు వారు తెలిపారు. పీవీ మదన్‌మోహన్‌రావు మాట్లాడుతూ గతంలో రథం మూడంతస్తులు ఉండేదని విద్యుత్ తీగల అంతరాయం ప్రభావంతో ఒక అంతస్తుకు కుదించినట్ల పేర్కొన్నారు. కార్యక్రమంలో పీవీ మనుమడు రాఘవేంద్ర కాశ్యప్, శరత్‌బాబు, మాజీ సర్పంచ్ వెంకట్‌రెడ్డి, సతీష్‌రెడ్డి, రామోజు మొండయ్య, బుచ్చిరెడ్డి, మల్లారెడ్డి, లక్ష్మినారాయణ, సుమన్, ప్రభు, గోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక ఆకర్షణగా మేకల బండ్లు

వేలేరు : కొత్తకొండ జాతరలో మేకల బండ్లు కనిపించడంతో భక్తులు ప్రత్యేకంగా తిలకించారు. మంగళవారం రాత్రి మండల కేంద్రానికి చెందిన యాదవ కులస్తులు ప్రతీ సంవత్సరం వీరభద్రస్వామి జాతరకు మేకపోతులతో తయారు చేసిన బండ్లతో వచ్చి మొక్కులు చెల్లించుకుంటారు. ఈ ఏడాది కూడా జాతరకు రావడంతో ఆలయ అధికారులు,అర్చకులు ఘనంగాస్వాగతం పలికి పూజలు చేశారు.

కౌశిక్‌కు మతి పోయినట్లుంది..

- మెంటల్ హాస్పిటల్‌లో చూపించుకోవాలి
- కాంగ్రెస్ పార్టీ హుజూరాబాద్ ఇన్‌చార్జ్ ప్రణవ్

కమలాపూర్ : హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డికి మతి పోయినట్లుందని, వెంటనే మెంటల్ హాస్పిటల్‌లో చూయించుకోవాలని లేకుంటే ఆయన పిచ్చి బీఆర్ఎస్ పార్టీకి అంటుకునే ప్రమాదముందని కాంగ్రెస్ హుజూరాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఒడితల ప్రణవ్ విమర్శించారు. కమలాపూర్‌లో సంక్రాంతి పండుగ సందర్భంగా మంగళవారం నిర్వహించిన ముగ్గుల పోటీల విజేతలకు బహుమతులు అందజేసిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి వ్యవహార శైలి రోజురోజుకు ముదిరిపోతోందన్నారు. ఇటీవల ఎమ్మెల్యే సంజయ్‌పై కౌశిక్‌రెడ్డి దాడి చేసిన తీరును యావత్ ప్రపంచం ఖండిస్తోందన్నారు. ఎమ్మెల్యే స్థాయిలో ఉన్న వ్యక్తి సహనాన్ని కోల్పోయి విచక్షణా రహితంగా వ్యవహరించడం ఎంత వరకు సబబు అని ప్రశ్నించారు. ఇప్పటికైనా ఆయన తన తీరు మార్చుకొని నియోజకవర్గ అభివృద్ధికి చొరవ చూపాలని, లేదంటే త్వరలోనే ఆయనకు గుణపాఠం తప్పదని హెచ్చరించారు.



కౌశిక్‌రెడ్డి ఫ్లెక్సీని దహనం చేస్తున్న యూత్ కాంగ్రెస్ నాయకులు

కౌశిక్‌రెడ్డి ఫ్లెక్సీ దహనం

ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి ఫ్లెక్సీని యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో బుధవారం రాత్రి మండల కేంద్రంలో దహనం చేశారు. నాయకులు మాట్లాడుతూ నియోజకవర్గ ప్రతిష్టను దిగజార్చే విధంగా వ్యవహరిస్తున్న ఎమ్మెల్యే తన తీరు మార్చుకుని ఎన్నికల సమయంలో నియోజకవర్గ ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలని, లేదంటే నియోజకవర్గంలో తిరుగనివ్వబోమని హెచ్చరించారు. యూత్ కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి సజ్జు మహ్మద్, అసెంబ్లీ నియోజకవర్గ ఉపాధ్యక్షుడు ధర్మల శ్రీకాంత్, కార్యదర్శి ఆడెపు శ్రీకాంత్, మండల అధ్యక్షుడు దూడ శ్రీకాంత్, ఉపాధ్యక్షుడు చేరాల రోహిత్, ప్రధాన కార్యదర్శి గాలజు నవీన్, నాయకులు పాల్గొన్నారు.

లక్ష్మీనర్సింహస్వామి జాతర ప్రారంభం

దామెర : మండలంలోని ఊరుగొండ లక్ష్మీనర్సింహస్వామి జాతర మంగళవారం రాత్రి వైభవంగా ప్రారంభమైంది. ఉత్సవాల్లో భాగంగా లక్ష్మీనర్సింహస్వామి ఆలయం నుంచి స్వామివారి ఉత్సవ విగ్రహాలను ప్రత్యేకంగా అలంకరించిన ఏనుగు వాహనం గ్రామం సమీపంలోని గుట్టపై ఉన్న ఆలయానికి ఊరేగింపుగా తీసుకొని వచ్చారు. అనంతరం ఏనుగు వాహనాన్ని, మేకపోతుల వాహనంతో ఏర్పాటు చేసిన ప్రభబండ్లను గుట్టచుట్టు సంప్రదాయరీతిన ప్రదక్షణలు చేశారు. బుధవారం తెల్లవారు జాము నుంచే భక్తుల తాకిడి ఆలయానికి పోటెత్తింది. దీంతో ఆలయ ప్రాంగణం పూర్తిగా సందడి నెలకొంది. ఉమ్మడి వరంగల్ జిల్లాతో పాటు ఖమ్మం, కరీంనగర్, ఆదిలాబాద్, హైదరాబాద్ పరిసర ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు స్వామి దర్శనం కోసం తరలివచ్చారు. ఈ సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకులు తూపురాణి శ్రీనివాసాచార్యులు స్వామివారికి అర్చన అభిషేకాలు నిర్వహించారు. ఎండపల్లి చెన్నకేశవరెడ్డి దంపతులు స్వామివారికి పట్టువస్త్రాలు సమర్పించారు. జాతర ప్రాంగణంలో పెద్దఎత్తున దుకాణాలు ఏర్పాటు చేయడంతో సందడి నెలకొంది. ఎండపల్లి, గుడిపాటి, మహాకాళ వంశస్తుల ఆధ్వర్యంలో సుమారు 10 వేలకుపైగా భక్తులకు మహాఅన్నదాన కార్యక్రమం నిర్వహించారు. పరకాల రూరల్ సీఐ రంజిత్ రావు ఆధ్వర్యంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా గట్టిబందోబస్తు నిర్వహించారు. ఎస్సై పరమేశ్వర్, ఏఎస్సైలు యాకయ్య, రమేష్, 40 మంది సిబ్బంది బందోబస్తు నిర్వహించారు.



దర్శనం కోసం క్యూలైన్లో భక్తులు

సంక్షిప్త సమాచారం

ఘనంగా గోదాదేవి రంగనాయకుల కల్యాణం



శాయంపేట : స్థానిక శివ మార్కండేయ వేంకటేశ్వర స్వామి ఆలయ సముదాయాల్లో మంగళవారం గోదాదేవీ రంగనాయకుల కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు మార్త రాజ్‌కుమార్, రమేశ్ వేదమంత్రాల మధ్య అంగరంగ వైభవంగా కల్యాణాన్ని నిర్వహించారు. స్వామివారికి ఆలయ కమిటీ చైర్మన్ బాసాని సూర్యప్రకాష్ దంపతులు పట్టువస్త్రాలు, తలంబ్రాలు, మంగళ సూత్రం సమర్పించారు. కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర మినిమం వేజెస్ అడ్వైజరీ మెంబర్ బాసాని చంద్రప్రకాష్, భక్తులు పాల్గొన్నారు.

ఆత్మకూరు: మండలకేంద్రంలోని వేణుగోపాలస్వామి ఆలయంలో మంగళవారం రాత్రి గోదాకృష్ణుల కల్యాణం వైభవంగా జరిగింది. అర్చకులు మాధవమూర్తి ఆధ్వర్యంలో కల్యాణాన్ని నిర్వహించారు.

యువతి అదృశ్యం

దామెర : యువతి అదృశ్యమైన ఘటన మండలంలోని పసరగొండలో బుధవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన ఓ యువతి ఈ నెల 13న ఇంట్లో నుంచి అర్ధరాత్రి బయటకు వెళ్లింది. దీంతో ఆమె ఆచూకీ కోసం బంధువుల ఇళ్లతో పాటు స్నేహితుల ఇళ్లలో ఎంతవెతికినా ఆచూకీ లభించలేదు. కాగా ఆమె తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించినట్లు పోలీసులు తెలిపారు.

ఆకట్టుకున్న ముగ్గుల పోటీలు



కమలాపూర్: సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకుని కమలాపూర్‌లో స్టార్ ఫ్రెండ్స్ యూత్ ఆధ్వర్యంలో పనగట్ల ప్రాంతంలో మంగళవారం నిర్వహించిన ముగ్గుల పోటీలు విశేషంగా ఆకట్టుకున్నాయి. పోటీల బహుమతుల ప్రదానోత్సవ కార్యక్రమానికి కాంగ్రెస్ పార్టీ హుజూరాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జీ ఒడితల ప్రణవ్ ముఖ్య అతిథిగా హాజరై విజేతలకు బహుమతులు అందజేశారు కార్యక్రమంలో ఏఎంసీ చైర్ పర్సన్ తౌటం ఝాన్సీ రాణి,రవీందర్, చరణ్‌పటేల్, రమేష్‌గౌడ్, రాజిరెడ్డి, డాక్టర్ కుమారస్వామి, యువజన కాంగ్రెస్ మండల ఉపాధ్యక్షుడు రోహిత్, స్టార్ ఫ్రెండ్స్ యూత్ అధ్యక్షుడు క్రాంతికుమార్, తదితరులు పాల్గొన్నారు.

పథకాలు అర్హులకు అందేలా కృషి

- అడిషనల్ కలెక్టర్ వెంకట్‌రెడ్డి

కమలాపూర్: ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన పేదలకు అందేలా కృషి చేయాలని అడిషనల్ కలెక్టర్ వెంకట్‌రెడ్డి సూచించారు. ఈ నెల 26న రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభించనున్న రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా ఆహార భద్రత కార్డుల జారీ, ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక మార్గదర్శకాలకు సంబంధించి ఎంపీడీఓ కార్యాలయంలో మండల, గ్రామ స్థాయి అధికారులు, సిబ్బందికి బుధవారం నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. వ్యవసాయ, రెవెన్యూ, పంచాయతీ రాజ్ అధికారులు, ఉపాధి హామీ సిబ్బంది, అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేసి పథకాలను పేదలకు అందేలా చూడాలన్నారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి రవీందర్ సింగ్, ఎంపీడీఓ గుండె బాబు, తహసీల్దార్ సురేష్‌కుమార్, ఏఓ రాజ్‌కుమార్, ఉపాధి హామీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



కమలాపూర్ : మాట్లాడుతున్న అడిషనల్ కలెక్టర్ వెంకట్‌రెడ్డి



శాయంపేట : మాట్లాడుతున్న ఆర్డీఓ నారాయణ



పరకాల: మాట్లాడుతున్న ఎంపీడీఓ ఆంజనేయులు



వేలేరు: మాట్లాడుతున్న ప్రత్యేకాధికారి మల్లయ్య

సర్వే సమయంలో సెలవులు లేవు : ఆర్డీఓ

శాయంపేట : ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలుకు అధికారులు అంకిత భావంతో పనిచేయాలని, సర్వే సమయంలో అధికారులకు ఎలాంటి సెలవులు ఉండవని ఏ దరఖాస్తు వచ్చినా స్వీకరించాలని పరకాల ఆర్డీఓ నారాయణ అధికారులకు సూచించారు. ఎంపీడీఓ కార్యాలయంలోని సమావేశ మందిరంలో బుధవారం నాలుగు పథకాల విధివిధానాలపై ఎంపీడీఓ ఫణిచంద్ర అధ్యక్షతన మండలస్థాయి అధికారులు, పంచాయతీ కార్యదర్శులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ, మండల స్పెషల్ ఆఫీసర్, డిస్ట్రిక్ వెల్ఫేర్ ఆఫీసర్ జయంతి పాల్గొని మాట్లాడుతూ నాలుగు సంక్షేమ పథకాల అమలు ఈ నెల 26న ప్రారంభించనున్న నేపథ్యంలో మండల స్థాయి అధికారులు నిబద్ధతతో పని చేయాలని తెలిపారు. తహసీల్దార్ సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

శిక్షణలో సెల్‌ఫోన్లలో నిమగ్నమైన అధికారులు

ఎంపీడీఓ సమావేశ మందిరంలో ఆర్డీఓ నారాయణ శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్న ఎంపీడీఓ ఫణిచంద్ర, ఏఓ గంగాజమున, ఏపీఓ అనిత, కొంతమంది పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లు సెల్‌ఫోన్లలో నిమగ్నం కావడంతో సాక్షి క్లిక్ మనిపించింది.

పరకాల: అర్హులైన ప్రతి లబ్ధిదారుడికి ప్రభుత్వ పథకాలు అందేలా చూడాలని పరకాల మున్సిపల్ కమిషనర్ సుష్మా, ఎంపీడీఓ పెద్ది ఆంజనేయులు అన్నారు. ఎంపీడీఓ కార్యాలయంలో బుధవారం జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ఈ నెల 16న(నేడు)నుంచి 20 వరకు వరకు చేపట్టే క్షేత్రస్థాయి సర్వేలో ఎటువంటి సమస్యలు తలెత్తకుండా అత్యంత జాగ్రత్తగా, సజావుగా పూర్తి చేయాలని కమిషనర్ సుష్మా ఆదేశించారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఎ.వెంకటభాస్కర్, ఏఓ శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

పథకాలు పక్కాగా అమలు చేయాలి

వేలేరు: మండల కేంద్రంలోని రైతు వేదికలో క్లస్టర్ అధికారులతో సమీక్షా సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతు భరోసాకు బుధవారం నుంచి 20వ తేదీ వరకు ఫీల్డ్ వెరిఫికేషన్ పూర్తి చేయాలని. 21 నుంచి 24వ తేదీ వరకు గ్రామసభలు నిర్వహించి పథకాలపై దండోరా వేయాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ హెచ్.కోమి, ఎంపీడీఓ లక్ష్మీప్రసన్న, ఏఓ కవితారాణి, తదితరులు పాల్గొన్నారు.

చలో మానుకోటను విజయవంతం చేయాలి



శాయంపేట : తెలంగాణ ఉద్యమకారుల హక్కుల సాధన కోసం ఈ నెల 19న మహబూబాబాద్‌లో జరిగే ఉద్యమకారుల యాత్రకు మండలంలోని ఉద్యమకారులు అత్యధిక సంఖ్యలో తరలిరావాలని ఉమ్మడి వరంగల్ జిల్లా కో కన్వీనర్ పాడిశెట్టి గణేష్ తెలిపారు. మండల కేంద్రంలోని ఉద్యమకారుల ఫోరం మండల అధ్యక్షుడు ఇమ్మడిశెట్టి రవీందర్ అధ్యక్షతన జరిగిన సమావేశానికి గణేష్ పాల్గొని మాట్లాడారు. తెలంగాణ ఉద్యమకారుల హక్కుల కోసం పోరాడే సమయం ఆసన్నమైందన్నారు. ఉద్యమకారుల ఫోరం మండల ప్రధాన కార్యదర్శి చల్లా శ్రీనివాస్ రెడ్డి, హనుమకొండ జిల్లా ఉపాధ్యక్షులు సురేష్, సారయ్య, జిల్లా యూత్ అధ్యక్షులు కొమ్ముల శివ, మండల కోశాధికారి నాగరాజు, దేవరాజు, ప్రభాకర్, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సంక్రాంతి వేడుకలు

పరకాల, ఎల్కతుర్తి, శాయంపేట, నడికూడ, దామెర, కమలాపూర్, మండలంలో మంగళవారం సంక్రాంతి వేడుకలను ఘనంగా నిర్వహించుకున్నారు. మహిళలు తమ ఇళ్ల ముందు పేడతో కల్లాపి చల్లి రంగురంగులతో ముగ్గులు వేసి గొబ్బెమ్మలను అలంకరించారు. రేగుపండ్లు, నవధాన్యాలు పోశారు. మూడు రోజుల పాటు నోరూరించే పిండి వంటలను ఆరగించారు. పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి తన స్వగ్రామమైన ప్రగతి సింగారంలోని సీతారామచంద్రస్వామి దర్శనం చేసుకున్నారు. గ్రామాల్లోని ఆలయాలల్లో ప్రజలు ప్రత్యేక పూజలు చేశారు.

– సాక్షి, నెట్‌వర్క్



శాయంపేట : సీతారామచంద్ర స్వామిని దర్శించుకున్న మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి



పరకాల : ముగ్గులు వేస్తున్న మహిళలు




నడికూడలో వేసిన ముగ్గు



కమలాపూర్‌లో..

క్రీడలతో మానసికోల్లాసం

ఆత్మకూరు: క్రీడలతో మానసికోల్లాసం కలుగుతుందని మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి అన్నారు. స్థానిక హైస్కూల్‌లో బీఆర్ఎస్ ఆత్మకూరు పట్టణ అధ్యక్షుడు పాపని రవీందర్ తల్లిదండ్రులు అయిన లలిత -విశ్వనాథం జ్ఞాపకార్థం గ్రామస్థాయి కబడ్డీ, వాలీబాల్ పోటీలు నిర్వహించారు. విజేతలకు మంగళవారం ధర్మారెడ్డి బహుమతులు ప్రదానం చేశారు. నగదు, షీల్డ్‌లు అందజేశారు. ఈ సందర్భంగా ధర్మారెడ్డి మాట్లాడుతూ గ్రామాలలో క్రీడలు నిర్వహించడం అభినందనీయమన్నారు. బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు లేతాకుల సంజీవరెడ్డి, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ కాంతాల కేశవరెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ రేవూరి సుధాకర్‌రెడ్డి, నాయకులు అంకూస్, నత్తి సుధాకర్, భగవాన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



బహుమతుల ప్రదానం చేస్తున్న మాజీ ఎమ్మెల్యే ధర్మారెడ్డి